RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | మంగళవారం 15 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 155 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## మోడీతో ఆప్ సీఎం భేటీ

సీఎంగా బాధ్యతలు చేపట్టాక కలిసినట్లు అతిషి వెల్లడి

2లో..



## సాయిబాబాకు ఘనంగా నివాళి

### గన్‌పార్క్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు

**అనంతరం గాంధీ ఆస్పత్రికి బాడీ అప్పగింత**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం ఇంటికి తరలించగా పలువురు నివాళి అర్పించారు. తదుపరి పార్థివదేహాన్ని గాంధీ ఆస్పత్రికి అప్పగించారు. అంతకుముందు గన్ పార్క్ వద్ద సీపీఐ నేత నారాయణతో పాటు పలువురు వామపక్ష నేతలు అంజలి ఘటించారు. సాయిబాబా అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. కామ్రేడ్ సాయిబాబా అమర్‌రహే, లాల్ సలాం, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. గన్‌పార్కు వద్ద 5 నిమిషాల సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబసభ్యులు, అభిమానులు కోరగా, పోలీసులు నిరాకరించారు. సాయిబాబా పార్థివదేహాన్ని అంబులెన్స్‌లోనే ఉంచి నిర్వహిస్తామని చెప్పినా అనుమతి ఇవ్వలేదు. దీంతో సాయిబాబా అభిమానులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం సాయిబాబా భౌతికకాయాన్ని మౌలాలిలోని ఆయన నివాసానికి తరలించారు. పుస్తకాలు కాకుండా సమాజాన్ని చదివేవారు మేధావులని సీపీఐ నేత నారాయణ అన్నారు. సాయిబాబా అలాంటి వ్యక్తి అని కొనియాడారు. గన్‌పార్కు వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. సాయిబాబాను పదేళ్లు అన్యాయంగా జైల్లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దోషి



ఎవరో తేల్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తికి లేఖ రాస్తామని నారాయణ చెప్పారు. సాయిబాబా భౌతిక కాయానికి మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కోదండరామ్ నివాళి అర్పించారు. జైలు నుంచి వచ్చిన కొన్నాళ్లకే సాయిబాబా మరణించడం బాధాకరమని హరీశ్‌రావు అన్నారు. సమాజంలో మార్పు, హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. హక్కుల కోసం పోరాడేవారిపై అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. సాయిబాబాపై కేంద్రం అణచివేత ధోరణితో వ్యవహరించిందని కోదండరామ్ తెలిపారు. ఆయన మృతికి కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలు కోసం సాయిబాబా పోరాడారని తెలిపారు. ప్రజాస్వామ్య వాదులంతా ఆయన నిర్బంధాన్ని ఖండించారని కోదండరామ్ గుర్తుచేశారు.

# మూసీ ఉనికినే దెబ్బతీసేలా రాడార్ సెంటర్

**2,900 ఎకరాలలో 12 లక్షల చెట్ల నరికివేతకు సిద్ధమైన కాంగ్రెస్**

**ఇక మూసీ సుందరీకరణలో అర్థం లేదు**

**వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుపై కేటీఆర్ ఆగ్రహం**




హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో దీనిని రాకుండా చూశామని అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ పేరుతో లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే మరోవైపు మూసీ నదిని పూర్తిగా ప్రమాదంలో పడేసే రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడమేమిటని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదెక్కడి ద్వంద్వ వైఖరంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏం ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తుండటాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. రామగుండంలో రాడార్ ఏర్పాటు కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ చెప్పారు. దాదాపు 2,900 ఎకరాల అటవీ భూభాగంతో పాటు 12 లక్షల చెట్లను నరికివేసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారన్నారు. జనవాసాలే లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఎందుకు తెలంగాణలో నిర్మిస్తున్నారో చెప్పాలన్నారు. మాట్లాడితే మూసీ పరిరక్షణ అని చెబుతున్న ముఖ్యమంత్రి మూసీనే ప్రమాదంలో పెట్టే ఈ ప్రాజెక్టుకు ఎందుకు అంగీకారం తెలిపారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ తమ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలపలేదని కేటీఆర్ గుర్తు చేశారు. దేశంలోనే అటవీ సామర్థ్యాన్ని పెంచేందుకు హరితహారం ..మిగతా 2లో

## రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాల

**ఫాక్స్‌కాన్ కంపెనీ పనులను పర్యవేక్షించిన సీఎం రేవంత్**

హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లో నూతనంగా ఏర్పాటు అవుతున్న ఫాక్స్ కాన్ కంపెనీ పనులను పరిశీలించేందుకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఫాక్స్ కాన్ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, కేఎల్ఆర్ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి, మంత్రి కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కంపెనీని సందర్శించారు. ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఫాక్స్ కాన్ చైర్మన్ యాంగ్ లియూ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఫాక్స్ కాన్ కంపెనీని సీఎం కోరారు.





## హెజ్బొల్లా భీకర దాడి

### ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ దుర్మరణం?

లెబనాన్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): ఏడాదిగా సాగుతున్న హమాస్-ఇజ్రాయెల్ యుద్ధంలో కీలక మలుపు. ఇటీవలి కాలంలో హమాస్ ను వదిలేసి లెబనాన్ ఉగ్ర సంస్థ హెజ్బొల్లాను టార్గెట్ చేసిన ఇజ్రాయెల్ కు భారీ షాక్ ఎవరూ ఊహించని విధంగా, కనీసం కలలో కూడా తలచుకోని రీతిగా ఇజ్రాయెల్ కు ఎదురుదెబ్బ తగిలింది. అది కూడా ఏకంగా ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) చీఫ్ మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే గనుక తీవ్ర పరిణామాలే ఉంటాయి. అమెరికా నుంచి శ్రీలంక వరకు ప్రపంచంలో ఎన్నో దేశాలకు సైన్యాలు ఉండొచ్చు. కానీ, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐపీఎఫ్) మాత్రం అత్యంత మేటి అని చెప్పక తప్పదు. చాలా చిన్న దేశానికి చెందినదే అయినా..ఐడీఎఫ్ చూపే తెగువ మామూలు స్థాయిలో ఉండదు. అయితే, తాజాగా ఐడీఎఫ్ చీఫ్ నే హతమార్చింది హెజ్బొల్లా అని అంటున్నారు. ఆ దేశంలోని బిన్యమిన ప్రాంతంలో ఉన్న సైనిక స్థావరమే లక్ష్యంగా హెజ్‌బొల్లా మానవ రహిత విమానాలు చేసిన దాడిలో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు చనిపోయారని, దాదాపు 67 మంది గాయపడినట్లు తెలుస్తోంది. అయితే, ఐడీఫ్ అధిపతి, లెఫ్టినెంట్ జనరల్ హెర్జిహలేవి కూడా మృతుల్లో ..మిగతా 2లో

## క్యాట్‌ను ఆశ్రయించిన... ఆ నలుగురు ఐఏఎస్‌లు

### తెలంగాణలోనే కొనసాగించాలని విజ్ఞప్తి


హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): తెలంగాణ కేడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులను డీవోపీటీ ఏపీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నలుగురు ఐఏఎస్ అధికారులు సోమవారం కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన వేర్వేరుగా క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని ఐఏఎస్ అధికారులు కోరారు. తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అధికారుల పిటిషన్లపై క్యాట్ మంగళవారం విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఏపీ విభజన నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేంద్రం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేంద్రం సర్దుబాటు చేసింది. ఈ సమయంలో ఐఏఎస్ అధికారులను ఏపీ, తెలంగాణ కేడర్‌లకు కేటాయించింది. అయితే, ఇందులో కొందరు ..మిగతా 2లో





## డోనాల్డ్ ట్రంప్‌పై మరోమారు హత్యాయత్నం

### రెండు గన్‌లతో సంచరించిన వ్యక్తి అరెస్ట్



న్యూయార్క్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పై మరోసారి హత్యాయత్నానికి ప్రయత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల కాలిఫోర్నియాలోని కోచెల్లాలో నిర్వహించిన ట్రంప్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి రెండు గన్‌లతో సంచరిస్తున్నట్లుగా తమకు సమాచారం అందిందని సీక్రెట్ సర్వీసెస్ పేర్కొన్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, అతడిని లాస్‌వెగాస్‌కు చెందిన వేం మిల్లర్(49)గా గుర్తించామని పోలీసులు పోలీసులు పేర్కొన్నారు. అయితే ట్రంప్‌నకు, ర్యాలీకి హాజరైన వారికి గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని వెల్లడించారు. నిందితుడు నకిలీ ప్రెస్‌కార్డు, ..మిగతా 2లో



## బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

**తక్కువ కాలంలోనే అప్రతిష్ట మూటకట్టుకున్న రేవంత్**

**మూసీ పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు**

**నవంబర్ 1 నుంచి బీజెపి ఉద్యమబాటు పడుతుంది**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**

వరంగల్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు): నవంబర్ 1 నుంచి బీజేపీ ఉద్యమ బాట పట్టనుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 10 సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రం వెనుకబడిరదన్నారు. రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ సరిగా పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ తరహాలోనే వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి ..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




## క్యాట్‌ను ఆశ్రయించిన...
# ఆ నలుగురు ఐఏఎస్‌లు

మొదటి పేజీ తరువాయి...

అధికారులు తమను ఏపీ కేడర్‌కు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ కేడర్‌గా గుర్తించాలని కోరుతూ పలు కారణాలను చూపించారు. అయితే, ఈ విషయంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ క్యాట్‌ను ఆశ్రయించగా అధికారుల అభ్యర్థనను క్యాట్ పరిగణలోకి తీసుకున్నది. అయితే, ఈ తీర్పును డీఓపీటీ తెలంగాణ హైకోర్టు సవాల్ చేసింది. 2023 మార్చిలో పిటిషన్‌పై విచారించింది. అధికారుల అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో దీపక్ ఖండేకర్ ఏకసభ్య కమిషన్‌ను కేంద్రం ఈ ఏడాది మార్చి 21న ఏర్పాటు చేసింది. కమిటీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అభ్యర్థనలను పరిశీలించింది. వ్యక్తిగతంగానూ విచారించి అభ్యర్థలను తిరస్కరించింది. ఈ క్రమంలో డీఓపీటీ ఏపీ కేడర్‌కు కేటాయించిన ఆలిండియా సర్వీస్ అధికారులను ఏపీ కేడర్‌కు వెళ్లాల్సిందిగా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని డీఓపీటీ స్పష్టం చేసింది. అయితే, డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ నలుగురు అధికారులు క్యాట్‌ని ఆశ్రయించారు.

## కల్లూరు ప్రాథమిక సహకార పరపతి సంఘంలో జరిగిన
# అవినీతి అక్రమాలపై అధికారుల మౌనమేలా?

**డిసిసిబి అధికారుల జాడేది....?**
**విచారణ ఏది... చర్యలేవి...?**
**అవినీతి పై మౌనమేల....!**
**సిబిసిఐడి.. ఏసిబి... లోకయుక్త కు వెళ్లి ఆలోచనలో....?**



**కల్లూరు-ప్రభాత సూర్యుడు:** కల్లూరు ప్రాథమిక సహకార పరపతి సంఘం లో జరిగిన అవినీతి అక్రమాలపై అధికారుల మౌనమేల... ప్రజలు చీ...చీ...అంటున్న నవ్విపోదురు నాకేంటి సిగ్గు అన్న చందంగా అధికారుల తీరు మారిందా అని ప్రజలు డిసిసిబి అధికారుల జాడెక్కడ అని అసహ్యించుకుంటున్నారు సంవత్సరం కాలము నుండి ఈ అవినీతి భాగోతం బయటపడిన అధికారులకు ఏమాత్రం చలనం లేకుండా నిమ్మకు నీరుతున్నట్లు వ్యవహరించడంలో దాగి ఉన్న ఆంతర్యం ఏమిటో ఎవరికి అంతుచిక్కని ప్రశ్న గానే మారింది సాక్షాత్తు సొసైటీ డైరెక్టర్,అన్యాయనికి గురైన బాధితులు, పత్రికలు ఘోషిస్తున్న అధికారులలో ఎందుకు చలనం రావటం లేదో అర్థం కాని ప్రశ్న గానే మిగిలిపోయింది. అవినీతి జరిగితే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని వారి సంగతి చూస్తాం అంతు చూస్తాం డాం... డుష్ ... అంటూ ప్రగల్బాలు పలికే అధికారుల జాడే లేకుండా పోయిందని చర్చ కల్లూరులో జోరుగా సాగుతుంది కారణమేమిటి అవినీతి జరగలేదా... లేక అధికారులకు తెలియలేదా... తీరిక లేకపోయిందా... లేదా అమ్యమ్యాలకు లోనైనారా..కాసులకు కక్కుర్తి పడ్డారా.. సంగతి తేల్చాల్సిన జిల్లా బాసులు మౌనమేల..? ఏ శాఖలోనైనా బలమైన ఆరోపణ వస్తే మొట్టమొదట ప్రాథమికంగా చేయవలసిన పని అధికారులు విచారణకు ఆదేశించడం తరచుగా చూస్తాం కానీ అలా జరగలేదు. విచారణ జరగకపోవడంలో అవినీతి జరగలేదని అనుకున్నారా లేక అమ్యమ్యాలకు కట్టడి చేశారా అన్న ప్రశ్నలు ప్రజల్లో నుండి వ్యక్తమవుతున్నాయి. సొసైటీలో ఇంతటి అవినీతి జరిగినా అక్రమాలకు పాల్పడినా విచారణ ఏది చర్యలేవి అంటూ మండలంలో ఎక్కడ చూసినా ఆ నోట ఈ నోట బహిరంగముగానే చర్చ జరుగుతుంది. బాధితులు న్యాయం కోసం సిబిసిఐడి, ఎసిబి, లోకాయుక్త మెట్లు ఎక్కనున్నట్లు కనిపిస్తుంది.

### కమిషన్ గోల్ మాల్

ప్రాథమిక సహకార పరపతి సంఘంలో ఖరీఫ్, రబీ పంటల సమయాలలో రైతుల వద్దనుండి సేకరించిన ధాన్యం వ్యాపారంలో సిబ్బందికి ప్రభుత్వం 10 శాతం కమిషన్ ఇవ్వటం జరుగుతుంది. ఈ కమిషన్ గోల్ మాల్ అయినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు మిన్నట్టుకున్నాయి. బ్యాంకు నుండి డ్రా చేసిన కమిషన్ ఏమైంది ఎవరి ఖాతాలోకి జమైంది అన్న విషయం రహస్యంగానే ఉంచారు. లక్షల రూపాయలు దారి మళ్లించింది ఎవరు... సహకరించిన సూత్రధారులు ఎవరు? ఎవరి వాటా ఎంత...? నీకెంత... నాకెంత అన్న విషయము తెలియాలి. కానీ ఇప్పటివరకు ఏ అధికారి నిగ్గుతేల్చిన పరిస్థితి కనపడలేదు....? ఇప్పటికైనా కమిషన్ గోల్మాల్ లెక్క తేలుస్తారా వేచి చూడాల్సిందే.

### అంతా రహస్యమే ఎందుకు...?

ప్రాథమిక సహకార పరపతి సంఘం నందు గతంలో సీఈవోగా పనిచేసిన చారి రిటైర్మెంట్ అయిన కొన్ని గంటల వ్యవధిలోని హడావుడిగా గుట్టు చప్పుడు కాకుండా సీఈఓ ను ఎన్నుకోవడం చారి ఇన్చార్జి బాధ్యతలు ఇవ్వకుండానే విధుల్లో రావడం చూస్తే గండికోట రహస్యం లాగా మారింది. ఈ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అధికారి స్టాఫ్ అసిస్టెంట్ పుల్లారావు, నూతన సీఈఓ అయిన సబ్ స్టాఫ్ బీరవెల్లి శ్రీనివాసరావు, కంప్యూటర్ ఆపరేటర్, డైలీ వెజ్ వర్కర్లు పనిచేస్తున్నారు.

### ఎది నిజం

ప్రాథమిక సహకార పరపతి సంఘం లో నూతనముగా సీఈఓ అయిన బీరవల్లి శ్రీనివాసరావు 2006 లో సబ్ స్టాఫ్ గా జాయిన్ అయినారు. 2006 నుండి 2021 వరకు అధికారులు ఇచ్చిన నివేదికను బట్టి రికార్డులు పరిశీలించగా సబ్ స్టాఫ్ గాని విధులు నిర్వహించినట్లు ఆధారాలు కనపడుతున్నాయి.

### ఏమి జరిగింది

ప్రస్తుతం సీఈఓ బాధ్యతలు నిర్వర్తిస్తున్న బీరవల్లి శ్రీనివాసరావు నేను 2006 నుండి సబ్ స్టాఫ్ గా కాకుండా క్లర్కుగా విధులలో జాయిన్ అయినాను అని అధికారులకు తాను వాంగ్మూలం ఇవ్వడం వలన రికార్డు పరంగా ఇరుక్కున్నట్లు తెలుస్తుంది. రికార్డులు పరిశీలించగా సంఘములో ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా సంబంధిత రికార్డులను అధికారులు ఆడిట్ చేస్తారు వీటిపై మరల సంవత్సర కాలమున అసిస్టెంట్ రిజిస్టర్ ఆడిట్లు నిర్వహిస్తారు. స్టేట్మెంట్ షోవింగ్ ది పర్టికులర్స్ ఆఫ్ స్టాప్ వర్కింగ్ ఇన్ ది సొసైటీ ఫామ్ లో అధికారులు ఎవరెవరు, ఎప్పుడు జాయిన్ అయ్యారు వారి హోదాతో పాటు పూర్తి వివరాలు ఆ నివేదికలలో పొందుపరిచి వాటిని డిసిసిబి కల్లూరు, డిసిసిబి ఖమ్మం వారికి సమర్పిస్తారు. 2006 నుండి 2021 వరకు ప్రస్తుత సీఈఓ శ్రీనివాసరావు సబ్ స్టాప్ గానే ఉన్నారు.

### చర్యలు తీసుకోరూ సారూ

సొసైటీలో జరిగిన అవినీతి అక్రమాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి సారించి ఉన్నతాధికారులతో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు ఎటువంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే... కొసమెరుపు ఏంటంటే బాధితులు న్యాయం కోసం అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై సిబిసిఐడి,ఎసిబి, లోకయుక్తకు వెళ్లే ఆలోచనలు ఉన్నట్లు తెలుస్తుంది.




# మూసీ ఉనికినే దెబ్బతీసేలా రాడార్ సెంటర్

మొదటి పేజీ తరువాయి...

చేపట్టి అటవీ విస్తీర్ణాన్ని బీఆర్ఎస్ సర్కార్ పెంచిందన్నారు. అలాంటిది రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగాన్ని నాశనం చేసేలా చర్యలు చేపట్టడమేమిటని కేటీఆర్ ప్రశ్నించారు. గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గంగోత్రికి ఒక న్యాయం, మా మూసీ నదికి మరో న్యాయమా అంటూ నిలదీశారు. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానంలోనే ఉందన్నారు. నది పుట్టిన ప్రాంతాన్ని 'ఎకో సెన్సిటివ్ జోన్'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నది అంతర్థానం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సోర్స్ అఫ్ ద రివర్'పై ఇది గొడ్డలి పెట్టని చెప్పారు. మూసీ నది పురుడు పోసుకున్న చోట 12 లక్షల చెట్ల నరికివేతతో కోలుకోలేని అనర్థం జరుగుతుందన్నారు. పర్యావరణ సమతుల్యతకు పెను ప్రమాదాన్ని సృష్టించే ఈ ప్రాజెక్ట్‌ను విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం. మూసీ నదిని ఫణంగా పెట్టేందుకు సహకరిస్తూ మరో వైపు మూసీ పరిరక్షణ అంటూ ముఖ్యమంత్రి డ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మూసీ పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాడార్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకారం తెలిపేది కాదన్నారు. మూసీ పేరుతో వేల కోట్ల దోపిడీ చేయాలన్న ఆలోచనే తప్ప నిజంగా నది పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందుంటుంది కానీ జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి నష్టం చేస్తామంటే అంగీకరించమని చెప్పారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

మొదటి పేజీ తరువాయి...

విమర్శించారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2014 లో బీజేపీ సభ్యత్వ సేకరణ తర్వాత 2024 లో చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. నూతనంగా గ్రామీణ మండల జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీ సేకరణ ఏర్పాటు చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు కట్టకుండా పేదల ఇళ్లను కూల్చేస్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం కూడగట్టుకుందని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో రూ.లక్ష 80 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ఇంతవరకు డీపీఆర్ తయారు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతతోనే హర్యానా రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సహకరించకుండా ముందుకు పోనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్ లో బీజేపీకి గణనీయంగా ఓట్ల శాతం పెరిగిందని పార్టీని కొనియాడారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి అధిక ఓట్లు రావడం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భద్రాచలం, రామప్ప, జోగులాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెయ్యి స్తంభాల మండపంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. దేశ వ్యాప్తంగా 150 దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం. ఇప్పుడు యువత పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోంది. పెద్దలపై గౌరవం, దేశభక్తి, సమాజంపై బాధ్యత పెంచుకోవాలి. మరింత అంకితభావం, చిత్తశుద్ధితో దేశాభివృద్ధికి కృషి చేస్తాం. మోదీ ప్రభుత్వ హయాంలోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# హెజ్బొల్లా భీకర దాడి

మొదటి పేజీ తరువాయి...

ఉన్నట్లు ప్రచారం మొదల్కెంది. అమెరికా కామెంటేటర్ జాక్సన్ హింక్లె సైతం దీనిని ప్రస్తావించడంతో గగ్గోలు రేగింది. ధ్రువీకరించిన (వెరిఫైడ్) ఎక్స్ ఖాతాల్లోనూ ఇదే ప్రచారమైంది. అయితే, కొద్దిసేపటి తర్వాత ఈ ప్రచారం తప్పంటూ జెరూసలెం పోస్టు కథనం ప్రచురించింది. హెజ్బొల్లా మానవ రహిత విమానాలు/డ్రోన్లు చేసిన దాడి ఇప్పటివరకు ఇజ్రాయెల్ పై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఒకటిగా పేర్కొంటున్నారు. ఈ ప్రదేశం ఐడీఎఫ్ గోలాన్ బ్రిగేడ్ ట్రైనిస్ సెంటర్ లోని మెస్ గా చెబుతున్నారు. కాగా, డ్రోన్ల దండుగా రావడంతో ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు ఏం చేయలేకపోయినట్లు తెలుస్తోంది. ఐడీఎఫ్ ప్రతినిధి హగారీ మాత్రం యుద్ధంపై తమకు పూర్తిగా పట్టు ఉందని ప్రకటించారు. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను మానవ రహిత విమానం ఎలా తప్పించుకొందో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడిరచారు. లక్షన్నర రాకెట్లు హెజ్బొల్లా సొంతం. అయితే, దాని దగ్గర ఉన్న మిర్సాద్-1 రకం చాలా కీలకంగా చెబుతారు. దీంతోనే తాజాగా దాడి చేసిందని తెలుస్తోంది. 3 వేల మీటర్ల ఎత్తు దాకా ఎగురుతూ 40 కేజీల పేలుడు పదార్థాలతో ఈ డ్రోన్ 120 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై గంటకు 370 కిలోమీటర్ల వేగంతో దాడి చేస్తుందట. ఇరాన్ సూసైడ్ డ్రోన్ మొహాజిర్-2 శ్రేణికి చెందినది మిర్సాద్-1.. హెజ్‌బొల్లా ప్రధాన డ్రోన్. రెండేళ్లుగా వాడుతోంది. ఉగ్ర సంస్థ భారీ సంఖ్యలో రాకెట్లతో కలిపి మిర్సాద్-1 డ్రోన్లను ప్రయోగించిందని.. అందుకే ఇజ్రాయెల్ అడ్డుకోలేకపోయిందని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను డ్రోన్లు తప్పించుకోవడం తొలిసారి అని ఇజ్రాయెల్ చెప్పింది. తమ డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ చనిపోతే ఇజ్రాయెల్ ప్రతీకారం ఎలా ఉంటుందో ఊహించలేం.. దీనికి అమెరికా కూడా తోడుగా వస్తుంది. అసలే ఇరాన్ పై రేపోమాపో దాడి చేసేలా, వారి అణు స్థావరాలను లక్ష్యం చేసుకునేలా ఉంది ఇజ్రాయెల్. ఈ క్రమంలో ఐడీఎఫ్ చీఫ్ మరణం వారిని విపరీతంగా రెచ్చగొట్టినట్లే అవుతుంది.

# డోనాల్డ్ ట్రంప్‌పై మరోమారు హత్యాయత్నం

మొదటి పేజీ తరువాయి...

ఎంట్రీ పాస్‌తో ర్యాలీ వేదికకు సమీపంలో లోడ్ చేసిన షాట్‌గన్, హ్యాండ్‌గన్, హై కెపాసిటీ గల మ్యాగజైన్‌తో తిరుగుతుండగా, అతడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా నిందితుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే మితవాద సంస్థలో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సీక్రెట్ సర్వీసెస్ సహాయంతో ట్రంప్‌పై జరగబోయే మరో హత్యాయత్నాన్ని ఆపగలిగామని అన్నారు. రివర్‌సైడ్ కౌంటీ షెరీఫ్ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం నిందితుడు శనివారమే జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడని, అతడి వాహనానికి కూడా రిజిస్ట్రేషన్ లేదని పేర్కొన్నారు. కారులో మందుగుండు సామగ్రి, తుపాకులు లభించాయన్నారు. నకిలీ పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ సైతం ఉండటం తో హత్య అనంతరం విదేశాలకు పారిపోవడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు పోలీసులు అనుమాని స్తున్నారు. అయితే విచారణలో భాగంగా నిందితుడు మాట్లాడుతూ.. తనపై వస్తున్న ఆరోపణలను కొట్టిపడేశాడు. తాను ట్రంప్‌నకు మద్దతుదారుడినని పేర్కొన్నాడు. తన వద్ద ఉన్న ఆయుధాలను 2022లో వ్యక్తిగత రక్షణ కోసం కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు.

# రాగల ఐదురోజులు వర్షాలు
## వాతావరణకేంద్రం హెచ్చరిక



**హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిరదని.. వాయువ్య దిశగా కదులుతూ మరింత బలంగా మారుతుందని పేర్కొంది. మంగళవారం ఉదయం వరకు మధ్యబంగాళాఖాతం వరకు చేరుతుందని చెప్పింది. ఆ తర్వాత రెండురోజుల్లో మరింత ముందుకు కదులుతూ పశ్చిమ వాయువ దశగా కదులుతూ తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఏపీ తీరాలకు చేరే అవకాశం ఉందని వెల్లడిరచింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలుపడుతాయని చెప్పింది. మంగళవారం నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

# కొండా సురేఖపై కేటీఆర్ పరువు నష్టం

## 18వ తేదీకి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 18న కేటీఆర్‌తో పాటు నలుగురు సాక్షులు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్లను కోర్టు రికార్డు చేయనుంది. తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ది కోసం నిరాధారమైన ఆరోపణలు చేశారని అందులో పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ గతంలోనే లీగల్ నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో పేరొన్నారు. ఇచ్చిన గడువు ముగిసిన నేపథ్యంలో మంత్రిపై పరువు నష్టం దావా వేసినట్టు తెలిపారు.



తాను ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, తొమ్మిదేండ్లకుపైగా రాష్ట్ర మంత్రిగా పనిచేశానని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగు తున్నానని తెలిపారు. రాష్ట్రానికి ప్రపంచ దేశాలనుంచి పెట్టుబడులు సాధించేందుకు రాష్ట్రం తరఫున విదేశాల్లో జరిగిన అనేక సమావేశాలకు హాజరయ్యానని తెలిపారు. రాష్ట్ర పురోగతికి అంకితభావంతో పనిచేసి పలు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాంటి తనపై మంత్రి సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని, ఆమె వ్యాఖ్యలు తన పరువుకు భంగం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలను, సోషల్ మీడియాలోని కథనాలను, పలు టీవీ ఛానల్లో వచ్చిన వార్తలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తంచేసి కోర్టుకు సమర్పించారు. పత్రికల్లో వచ్చిన క్లిపింగ్‌లను, ఫోటోలను పిటిషన్‌కు జోడిరచి దాఖలు చేశారు. కొండా సురేఖ గతంలో కూడా ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేసి, ఎన్నికల సంఘంతో చీవాట్లు తిన్న విషయాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలను రాజకీయపరమైన వ్యాఖ్యలుగా మాత్రమే కాకుండా ప్రణాళికబద్ధంగా చేసిన కుట్రగా చూడాలని కేటీఆర్ తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. సురేఖ చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకొని, వాటి వెనుక ఉన్న నేరపూరిత దురుద్దేశాల పరిగణలోకి తీసుకొని, ఆమెకు చట్ట ప్రకారం శిక్ష వేయాలని కోర్టును కోరారు. కాగా అక్కినేని నాగచ్కైతన్య, సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతటి సంచలనాన్ని సృష్టించాయో అందరికీ తెలిసిందే. అంతేకాకుండా కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి అనేక కామెంట్స్ కూడా చేశారు. ఈ క్రమంలో కొండా సురేఖ వ్యాఖ్యలపై కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
# ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




## బైక్‌ను ఢీకొన్న బోర్‌వెల్ లారీ
### యువకుడు అక్కడిక్కడే మృతి

**మహబూబాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** మహబూబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను బోర్ వెల్ లారీ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిని వివరాలు ఇలా ఉన్నాయి. ఫొటో గ్రాఫర్ కూన వరుణ్ (20) అనే యువకుడు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తొర్రూరు పట్టణంలోని వరంగల్ ? ఖమ్మం జాతీయ రహదారిపై బైక్ ను బోర్ వెల్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వరుణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిది మేడ్చల్ జిల్లా సూరారానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఫ్రెండ్ సూర్యతో కలిసి బైక్ పై హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంటున్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మతోన్మాద రాజకీయాలను తిప్పుకొడుతూ, ప్రజా సమస్యలపై దృష్టి

### సిపిఎం నాయకుడు చుక్క రాములు




పటాన్ చెరువు ఐలా భవన్లో సిపిఎం ప్రతినిధులను ఉద్దేశిస్తూ మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకుడు చుక్కా రాములు

**పటాన్ చెరువు, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** దేశంలో మతోన్మాద రాజకీయాలు పెరుగుతున్నాయని, మత చాందసవాదులతో దేశం పురోగతి చెందటం లేదని, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. సోమవారం పటాన్చెరు పట్టణంలోని ఐలా భవన్లో సిపిఎం పటాన్ చెరువు ఏరియా రెండవ మహాసభల జెండాను ప్రారంభిస్తూ ప్రతినిధులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ ప్రజల దృష్టి మరల్చుతున్నారని అన్నారు. సిపిఎం పార్టీ, ఇతర వామపక్ష భావా సారూప్యం గల పార్టీలతో ప్రజల సమస్యలపై ఉద్యమించడానికి ఐక్య పోరాటాలు చేయడానికి సిపిఎం పార్టీ ప్రణాళికలు రూపొందిస్తుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి దేశ ప్రజల సమస్యలపై పరిష్కారాలు చేయక ప్రజలను మతం ఉచ్చులో బిగిస్తున్నారని అన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి అమిత్ షా లు పెట్టుబడిదారి వర్గాలకు ఊడిగం చేస్తున్నారని అన్నారు. బిజెపి అధికారంలో లేని ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలపై డేగ కన్ను వేసి అట్టి ప్రభుత్వాలను కూల కొట్టడానికి చేసే ప్రయత్నాలను సిపిఎం పార్టీ ఎదురుకోవడానికి సిద్ధంగా ఉన్నదని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఆరు గ్యారెంటీ లతో అధికారంలోకి వచ్చి గ్యారంటీల ఊసు ఎత్తక, కొత్తగా మూసీనది ప్రక్షాళన, సుందరీకరణ అంటూ 6 గ్యారంటీల అమలును పక్కదారి పట్టిస్తున్నాడని అన్నారు. చెరువులు, కుంటలు, కాలువలు మూసినది ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. మూసి ప్రక్షాళన పై వెంటనే అన్ని పార్టీలతో కలిపి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. పటాన్చెరు పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికుల సమస్యలపై పోరాటం చేయడానికి సిపిఎం పార్టీ ఎల్లవేళల సిద్ధంగా ఉన్నదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు కే రాజయ్య ఏరియా నాయకులు వాజిద్ అలీ, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, పెంటయ్య, జార్జ్, మహిళ నాయకురాలు సునీత, లలిత, బి ఆర్ వి కె రాజు రమణారెడ్డి, సురేందర్ రెడ్డి, శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో "అదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును తరిమికొడదాం"

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** ఉమ్మడి నల్లగొండ ప్రస్తుత భువనగిరి యాదాద్రి జిల్లా రామన్నపేటలో ఏర్పాటు చేయనున్న అదాని అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అందరూ కలిసికట్టుగా ఎదుర్కొని అట్టి పరిశ్రమను తరిమి కొట్టాలని రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరుద్దీన్ పిలుపునిచ్చారు. సోమవారం మాట్లాడుతూ పచ్చని పంట పొలాలలో పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆనుకొని కాలుష్యం వెదజల్లే సిమెంటు పరిశ్రమ ఏర్పాటును రైతులు, గ్రామస్తులు అందరూ కలిసి మూకుమ్మడిగా అట్టి పరిశ్రమ ఏర్పాటును అడ్డుకోవాలని అన్నారు. రామన్నపేట ప్రాంతంలో కాలుష్యం వెదజల్లే ఆదాని అంబుజా సిమెంట్ పరిశ్రమను ఎట్టి పరిస్థితుల్లో ఏర్పాటు చేయనీయమని అన్నారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు పట్టణంలోని రహదారి బంగ్లా ప్రాంగణంలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్య రహిత పట్టణాన్ని కాలుష్యకారక పరిశ్రమ ఏర్పాటుతో ఈ ప్రాంతం మొత్తం కాలుష్యం మయం కానున్నదని అన్నారు. వాతావరణ సమతుల్యం దెబ్బతిని మొత్తం ప్రాణకోటికి ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. అందువల్ల మండల, పట్టణ ప్రజలు పార్టీలకు అతీతంగా ఏకమై ఆదని ఏర్పాటు చేయబోతున్న ప్రమాదకర సిమెంట్ పరిశ్రమను అడ్డుకొని తరిమి కొట్టాలని అన్నారు. ఆరంభంలోనే అవకాశం ఇవ్వకుండా అందరూ ఐక్యమత్యంతో ఇట్టి పరిశ్రమ ఏర్పాట్లు అడ్డుకోవాలని అన్నారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు జరిగే అఖిలపక్ష సమావేశానికి పెద్ద ఎత్తున ప్రజలు అన్ని రాజకీయ పక్షాల నాయకులు హాజరై, కాలుష్యకారక సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన పార్టీ అన్ని వింగుల నాయకులు మహిళా నాయకులు, రైతు నాయకులు, కార్మిక నాయకులు, యువజన, విద్యార్థి నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు.



# పంట పొలాలలో సెప్టిక్ ట్యాంక్ వెస్ట్‌నీ వదిలి వెళుతున్న సెప్టిక్ క్లినర్స్

**కల్లూరు -ప్రభాత సూర్యుడు:** కల్లూరు మండలం పేరువంచ గ్రామ పంచాయితీ చిల్లంపల్లి చెరువు ఆయకట్టు ఆర్ & బి రోడ్డు పక్కన బడుగు వెంకటేశ్వర్ రావు అనే రైతు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు. బడుగు వెంకటేశ్వరరావు అనే రైతు వ్యవసాయ భూమి ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే అనుకుని ఉన్నది దానిలో వరి పంట వేసినారు ఐతే అతను వరి పొలం లో గుర్తు తెలియని సెప్టిక్ క్లినర్ ట్యాంకర్ వాళ్ళు డస్ట్ నీ పంట పొలాలో వదిలి పంటను కలుషితం చేస్తున్న ఆగాంతకులు దాని వల్ల పంట ఎండిపోతుంది అనీ వెంకటేశ్వర్ రావు రైతు ఆవేదన వ్యక్తం చేసారు.ఎంతో కష్ట పడి పెట్టుబడి పెట్టి చేతికి వస్తున్న పంటను సెప్టిక్ ట్యాంకర్ వాళ్ళు పంట పొలాల లో వదిలి వెళ్లే వ్యర్థల వల్ల వరి పంట ఎండి పోతున్న వైనం గతం లో కూడా ఇలా చేస్తే పట్టుకుని పోలీస్ స్టేషన్ లో అప్పగించి తగు చర్యలు తీసుకున్నారు ఐనా మారని తంతూ. రోడ్డు పైన వెళుతున్న ప్రయాణికులు కు దుర్గందము వేదజల్లుతుంది అని ప్రయాణికులు అసహ్యం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యం గా ఆ పరిసరాల రైతులు ఇబ్బందులు అంతా ఇంత కాదు అని రైతులు తెలియచేస్తున్నారు. పంచాయితీ అధికారులు, మండల ఎంపీడీఓ, పోలీస్,రెవిన్యూ వారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి అని రైతులు కోరుకుంటున్నారు.

# పోలీస్ ఉన్నతాధికారులను వేధించడం సరైనది కాదు

### ఆత్మహత్యకు పాల్పడ్డ కానిస్టేబుల్ కుటుంబానికి న్యాయం చేయాలి
### కారణమైన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలి
### ఆధార్ పార్టీ జిల్లా చైర్మన్ కంటే కేశవ గౌడ్



**సత్తుపల్లి -ప్రభాత సూర్యుడు:** పోలీస్ శాఖలో కానిస్టేబుల్ పై ఉన్నతాధికారుల పెత్తనం సరైనది కాదని, ఇటువంటి విధానాలను మానుకోవాలని ఆధార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ కంటే కేశవ గౌడ్ అన్నారు. జిల్లాలోని బూర్గంపాడు కానిస్టేబుల్ ఆత్మహత్యపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా కంటే కేశవ్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ కానిస్టేబుల్ చేయని తప్పుకు అతనిపై నిందలు వేసి బలవన్మరణానికి పాల్పడటానికి ప్రేరేపించిన వారిపై తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెల్ఫీ వీడియోలో తన ఆవేదనను వివరిస్తూ కానిస్టేబుల్ పడ్డ బాధలను చెప్పుకుంటూ ఆత్మహత్యకు పాల్పడటం చూస్తుంటే అతనను ఏ విధంగా ఇబ్బందులు పెట్టారో అర్థం అవుతుందన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న కానిస్టేబుల్ జీవితం అర్ధాంతరంగా ముగిసిందని, తక్షణమే ఆ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలన్నారు. ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్నప్పటికీ ఉన్నత శాఖ అధికారులు స్పందించక పోవడం శోషనీయమన్నారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వరావుపేట ఎస్సై, ప్రస్తుతం బూర్గంపాడు కానిస్టేబుల్ పై అధికారుల ఒత్తిడిలకు తట్టుకోలేక మృతి చెందటం బాధాకరమన్నారు. ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని అండగా ఉండాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వూకే.ముత్తయ్య. దొర.పూనేం నరేష్.ఈడ. నాగ వెంకట పుల్లారావు తల్లాడ వెంకటేశ్వరరావు.కుక్కల నాగేశ్వరరావు గౌడ్.ఆయన వెంట పలువురు ఆధార్ పార్టీ నాయకులు ఉన్నారు.



# దేశ చరిత్రలోనే రైతు పండించిన వరి ధాన్యానికి 500 రూపాయలు బోనస్ అందిస్తున్న తెలంగాణా ప్రభుత్వం

### రేవంత్ రెడ్డికి సత్తుపల్లి నియోజకవర్గ రైతు సోదరులు తరఫున ధన్యవాదములు
### ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**సత్తుపల్లి-ప్రభాత సూర్యుడు:** మండలపరిధిలో సదాశివుని పాలెం గ్రామం - సదాశివుని పాలెం గ్రామం లో సన్న రకం వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఐ కె పి ని సత్తుపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మొట్ట మొదటిగా సదాశివుని పాలెం లో ఐ కె పి ని పూజా కార్యక్రమం లో పాల్గొని ప్రారంభించిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ గారు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి మరియు వ్యవసాయ శాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులు సంక్షేమం కోసం సన్న రకం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈ సీజన్లో రైతులకు ముందుగానే ఏర్పాటు చేసి సన్న రకం వరి ధాన్యముకు 500 రూపాయలు బోనస్ అందించటం దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారి మన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభిస్తుంది. పట్టణ గ్రామాల్లోని రైతులు సంబంధిత అధికారుల ద్వారా పూర్తి సమాచారం తెలుసుకొని వరి కొనుగోలు కేంద్రంను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఏ గ్రేడ్ సన్న రకం వరి క్వింటా 2320/- రూపాయలు మరియు కామన్ గ్రేడ్ సన్న రకం పోరి 2,300/- రూపాయలు మరియు బోనస్ 500 రూపాయలు నేరుగా రైతులు ఖాతాల్లోకి అందించటం జరుగుతుంది అని తెలిపారు.అధికారులు రైతులు కు వరి ధాన్యం కొనుగోలు వివరాలు పూర్తి సమాచారం అందించాలని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కీ రైతులు తరుపున ధన్యవాదములు తెలియజేసిన సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి ఏ యం సి చైర్మన్ దోమ ఆనంద్, ఎంపీడీఓ, ఏ పి యం , ఏ ఈ ఓ , సెక్రటరీ, సత్తుపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివా వేణు మరియు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతు సోదరులు పాల్గొన్నారు.



# పామాయిలులో అంతర్ పంటగా వక్క పంట రైతన్నల ఇంట "సిరుల" పంట

### వక్క సాగును పరిశీలించిన మంత్రి తుమ్మల
### ఏలూరు జిల్లా కామవరపు కోటలో మంత్రి పర్యటన
### రైతుల అనుభవాలు విజయ రహస్యాలను తెలుసుకున్న మంత్రి
### అంతర పంటల సాగుతో లక్షల్లో ఆదాయం
### తెలంగాణలో వక్క సాగుకు అనువైన ప్రాంతం
### నిపుణులతో చర్చించి సాగుపై నిర్ణయం: మంత్రి తుమ్మల

**సత్తుపల్లి-ప్రభాత సూర్యుడు:** వక్క పంట సాగు రైతన్నల వెంట సిరులు కురిపిస్తుందని, తెలంగాణలో సైతం వక్క పంటల సాగును ప్రోత్సహిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏలూరు జిల్లా కామవరపు కోటలో వాణిజ్య పంటలైన వక్క సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వక్క సాగు రైతులతో సాగు పద్ధతులు ఆదాయ వ్యయాలపై రైతులతో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణలో వక్కసాగు విస్తరణ అంశాలు, అవకాశాలపై నిపుణులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వక్క సాగుతో రైతులు లక్షల్లో ఆదాయం సంపాదిస్తున్నారన్నారు. అనేక మంది రైతులు కొబ్బరి, పామాయిల్ తోటలలో అంతర్పంటలుగా సాగు చేస్తూ అధిక లాభాలు అర్జిస్తున్నారని వివరించారు. అన్నదాతలు ఆధునిక సాగు వైపు అడుగులు వేయాలని , అధిక ఆదాయం పొందేందుకు ఈ పంటలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. అనేకమంది రైతులు పోక, వక్క, తోటల్లో అంతర పంటలతో రైతులు అద్భుతాలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే పంటలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వక్క సాగు అనుకూల నేలలు,వాతావరణ పరిస్థితులు , నీటి వినియోగం తదితర అంశాలపై నిపుణులతో చర్చించి సాగును ప్రోత్సహించినట్లు మంత్రి పేర్కొన్నారు. వక్క సాగు చేస్తున్న అనేకమంది రైతులు నుంచి అనూహ్య స్పందన లభించిందని, సాగు చాలా ఆశాజనకంగా ఉందని రైతుల పేర్కొన్నట్లు మంత్రి వివరించారు. తెలంగాణ రైతాంగాన్ని రాజును చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతన్నలు శ్రేయస్సు కు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

## ఉక్కిరిబిక్కి చేస్తున్న వైవిధ్య వాతావరణం

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** అక్టోబర్ నెలలో సాధారణంగా చలి ఉండాలి. కానీ ఇప్పుడు భిన్నమైన వాతావరణంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఉక్కపోతలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం ఎండలు దంచేస్తుంటే.. సాయంత్రం అడపాదడపా వర్షం కురుస్తుంది. ఆ వెంటనే చలి తీవ్రత ఉంటుంది. ఇక రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా విరుద్ధమైన వాతావరణంతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇలాంటి వాతావరణం గతంలో ఎన్నడూ చూడలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం 7 నుంచే సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం 5 వరకు ఎండ తీవ్రత ఉంటున్నది. ఎండ తీవ్రతతోపాటు ఉకపోత అధికంగా ఉంటుంది. ఈ వేడికి వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ప్లలె, పట్టణం అనే తేడా లేకుండా.. ఇలాంటి వాతావరణం గత వారం రోజులుగా ఉంటున్నది. 20 నిమిషాలు బయట తిరిగితేనే.. త్వరగా డీహైడ్రేషన్‌కు గురై.. తొందరగా అలిసిపోతున్నారు. పట్టణాలతో పోలిస్తే గ్రామాల్లో ఈ పరిస్థితులు అధికంగా ఉన్నాయి. కొన్ని జిల్లాల్లో గరిష్ఠ పగటి ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.ఈ వేడి కారణంగా తాము పని చేసుకోలేకపోతున్నట్టు రైతులు వాపోతున్నారు. పంటలు చేతికొచ్చే సమయం కావడంతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రంతా ఫ్యాన్లు, ఏసీలు తిరుగుతున్నా ఉకపోత నుంచి ఉపశమనం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు. గ్లోబల్‌వార్మింగ్‌కు తోడు క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఈ వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు అంటున్నారు. దీనికితోడు కరెంట్ కోతలు పెరిగాయి. గతంతో పోలిస్తే కరెంట్ కట్స్ నిత్యం కనిపిస్తున్నాయి. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా మాత్రం సాగడం లేదు. ఎసిలు, ఫ్యాన్లు లేకుండా గడపలేని పరిస్థితి వచ్చింది. కరెంట్ ఛార్జీలు కూడా పెరుగుతున్నాయి. విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని అధికారులు కూడా అంచావేస్తున్నారు.

# పదేళ్లపాటు జైలులో నరకం

### తల్లి అంత్యక్రియలకు కూడా అనుమతి నిరాకరణ.. విషాదంగా ముగిసిన సాయిబాబా జీవితం

అర్బన్ నక్సలైట్ పేరుతో పలువురు మేధావులు జైళ్లలో మగ్గుతున్నారు. అలా మగ్గుతున్న వారిలో ప్రొఫెసర్ సాయిబాబా కాలం చెందారు. వరవరవరావు కూడా సుదీర్ఘకాలం జైలులో మగ్గారు. దాదాపు పదేళ్ల కారాగారం అనుభవిం చారు. దాంతీ తీవ్ర అనారోగ్యం బారిన పడ్డారు. తొంభై శాతం అంగవైకల్యం.. మానవ హక్కుల ఉద్యమంలో మమేకం.. పదేళ్ల కారాగార వాసం.. కన్నతల్లి చివరి చూపులకు నోచుకోలేని దైన్యం.. రెండుసార్లు నిరూపితమైన నిర్దోషిత్వం.. ఇదీ శనివారం కన్ను మూసిన ప్రొఫెసర్ గోకరకొండ నాగ(జీఎన్) సాయిబాబా(57) నేపథ్యం. సాయిబాబా, మరో ఐదుగురిపై మోపిన అభియోగాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) వర్తించదని ముంబయి హైకోర్టు తుదితీర్పు ఇచ్చేలోపు ఆయన పదేళ్లపాటు కారాగారం అనుభవించాల్సి వచ్చింది. శనివారం కన్నుమూసిన ప్రొఫెసర్ గోకరకొండ నాగ(జీఎన్) సాయిబాబా(57) నేపథ్యం. సాయిబాబా, మరో ఐదుగురిపై మోపిన అభియోగాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) వర్తించదని ముంబయి హైకోర్టు తుది తీర్పు ఇచ్చేలోపు ఆయన పదేళ్లపాటు కారాగారం అనుభవించాల్సి వచ్చింది. ఏపీలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లిలో రైతు కుటుంబంలో సాయిబాబా 1967లో జన్మించారు. తల్లిదండ్రులు గోకరకొండ సత్యనారాయణమూర్తి, సూర్యావతి. ఐదేళ్ల వయసులో సాయిబాబా కు పోలియో సోకి రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నా.. చదువులో వెనుకబడలేదు. అమలాపురంలో డిగ్రీ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లిష్ చదివారు. హైదరాబాద్‌లోని ఆంగ్ల, విదేశీ భాషల విశ్వవిద్యాలయం(నాటి సీఫెల్)లో ఎం.ఫిల్. చేశారు. 2003లో దిల్లీ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల రామ్‌లాల్ ఆనంద్ కళాశాలలో ఆంగ్లభాష సహాయ ఆచార్యుడిగా బాధ్యతలు చేపట్టారు. 2013లో దిల్లీ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. 1992లో హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆల్ ఇండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరమ్‌లో ఆయన సభ్యులుగా చేరారు. అప్పటి నుంచి మానవ హక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. కాగా, ఉపా కేసు నేపథ్యంలో సాయిబాబాను దిల్లీ విశ్వవిద్యాలయం 2021లో ఉద్యోగం నుంచి తొలగించింది.



మావోయిస్టు పార్టీకి చెందినవారితో కలిసి రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్(ఆర్‌డీఎఫ్) తరఫున సమావేశం ఏర్పాటు చేశారన్న ఆరోపణలపై 2014 మే నెలలో సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనతో పాటు జేఎన్‌యూ విద్యార్థి హేమ్ కేశవాదత్త మిశ్ర, ఉత్తరాఖండ్‌కు చెందిన పాత్రికేయుడు ప్రశాంత్ రాహి, మహేష్ కరిమన్ టిర్కీ, నారాయణ్ సాంగ్లీకర్, విజయ్ టిర్కీలనూ జైలుపాలు చేశారు. కరడు కట్టిన నేరగాళ్లను జైళ్లలోని అండా సెల్‌లో ఉంచుతారు. ఎవరినీ కలవనీయకుండా అలా చేస్తారు. వీల్‌ఛైర్‌కే పరిమితమై.. ఇతరుల సాయం లేకుండా దైనందిన కార్యకలాపాలూ నిర్వహించుకోలేని సాయిబాబాను కరోనా సమయంలో అలాంటి అండా సెల్‌లో ఉంచారు. దీంతో ఆయన నరకం అనుభవించారు. తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఎడమవైపు శరీరమంతా చచ్చుబడిపోయినా చికిత్స చేయించలేదని, నొప్పి నివారణ మాత్రలతో సరిపెట్టారని ఆయన ఆరోపించారు. అంగవైకల్యం, కరోనా ఆంక్షలను దృష్టిలో ఉంచుకొని ఆయనకు బెయిల్ ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతోపాటు పలు పౌరహక్కుల సంఘాలు ప్రభుత్వానికి లేఖలు రాసినా ఫలితం లేకపోయింది. వైకల్యం, ఇతర సమస్యల కారణంగా సాయిబాబా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో 2015 జూన్‌లో ముంబయి హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. అదే ఏడాది డిసెంబరులో బెయిల్ రద్దు కావడంతో మళ్లీ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 2016 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు మరోమారు బెయిల్ మంజూరు చేసింది. కానీ, 2017 మార్చిలో ఉపా చట్టం కింద సాయిబాబాను దోషిగా ప్రకటించి.. జీవితఖైదు విధిస్తూ మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. దాంతో సాయిబాబాతోపాటు ఇతర నిందితులను నాగ్‌పూర్ కేంద్ర కారాగారానికి తరలించారు. గడ్చిరోలి కోర్టు తీర్పుపై విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. 2022 అక్టోబరు 14న ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును మర్నాడే సుప్రీంకోర్టు నిలిపివేసింది. పునర్విచారణ జరపాలని హైకోర్టును ఆదేశించింది. మళ్లీ విచారణ జరిపిన ముంబయి హైకోర్టు.. 2024 మార్చి 5న సాయిబాబా తదితరులను నిర్దోషులుగా ప్రకటించింది. కేసులో సమర్పించిన సాక్ష్యాలు నమ్మశక్యంగా లేవని పేర్కొంది. 2014 నుంచి 3,588 రోజులపాటు జైలులోనే ఉన్న ప్రొఫెసర్ సాయిబాబా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొన్నారు. నరాలు దెబ్బతినడం, కాలేయ సమస్యలు, బీపీ తదితర సమస్యలు చుట్టుముట్టాయి. వీటితోపాటు హృద్రోగ సమస్యలు కూడా ఉన్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు విప్లవ రచయితర సంఘం (విరసం) నేత వరవరరావు ఆరోగ్యం దెబ్బతినడంతో వారి బంధువులు, అభిమానుల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. ఆ తర్వాత 2022 అక్టోబర్‌లో బాంబే హైకోర్టులోని నాగ్‌పూర్ బెంచ్ సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడంతో సాయిబాబా విడుదలపై సుప్రీంకోర్టు 2022 అక్టోబర్‌లో స్టే ఇచ్చింది. ఆ కేసులో మహారాష్ట్ర సర్కారు వాదనను తిరిగి వినాలని బాంబే హైకోర్టుకే రిఫర్ చేసింది. దీంతో ఈ ఏడాది మార్చి 5న బాంబే హైకోర్టు ఆయనను మరోసారి నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. మార్చి 7న నాగ్‌పూర్ కేంద్ర కారాగారం నుంచి ఆయన విడుదలయ్యార. కోర్టు తీర్పు నేపథ్యంలో సాయిబాబా .. హైదరాబాద్‌లో భార్య వసంత, కుమార్తె మంజీరాతో కలిసి నివాసం ఉంటున్నారు. జైల్లో ఉండగానే 'నేను చావును నిరాకరిస్తున్నాను', 'వై డు యూ ఫియర్ మై వే సోమచ్' పేరుతో కవితలు, లేఖలతో సాయిబాబా సంకలనం రచించారు. వైకల్యం ఉన్న తనను ఎంతో జాగ్రత్తగా పెంచిన తల్లికి అనారోగ్యంగా ఉందని, ఆమెను చూసేందుకు వెళ్లడానికి పెరోల్ ఇవ్వాలని వేడుకున్నా ఎవరూ పట్టించు కోలేదని, చివరికి కన్నతల్లి చనిపోయిన తర్వాత చివరి చూపులకు, కర్మకాండలకు హాజరయ్యేందుకూ అనుమతి లభించలేదని జైలు నుంచి విడుదలైన తర్వాత ఓ సందర్భంలో ఆయన వాపోయారు.

## బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

### ఎపిలో పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు.. వర్షాలతో నెల్లూరు అతలాకుతలం

**హైదరాబాద్, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, విశాఖ జిల్లాలో తెల్లవారుజాము నుంచి వర్షం పడుతోంది. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుమలలో కురుస్తున్న భారీ వర్షంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలోని ఇందుకూరిపేట, కోవూరు, కొడవలూరు మండలాల్లో ఎడతెరిపిలేకుండా భారీగా కురుస్తోంది. నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే 0861-2331261, 7995576699, 1077 నంబర్లకు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని.. రెవెన్యూ, నీటిపారుదల అధికారులు పెన్నా నది గట్లు పరిశీలించాలని ఆదేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు నేడు సెలవు ప్రకటించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు, మద్దిపాడు, గిద్దలూరు, కొమరోలులో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షంతో ఒంగోలులోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, మార్టూరు, ఇంకొల్లు, కొల్లూరు, వేమూరు, అద్దంకి, యద్దనపూడి, జె.పంగులూరు, బల్లికురవ, నిజాంపట్నం, కర్తపాలెంలో వర్షం కురుస్తోంది. కృష్ణా జిల్లా మచిలీపట్నం, ఉయ్యూరు, అవనిగడ్డలో ఈదరుగాలులతో వర్షం పడుతోంది. విశాఖపట్నంలోని పలు ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. అన్నమయ్య జిల్లాలోనూ వర్షం కురుస్తోంది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ సెలవు ప్రకటించారు. అల్పపీడనం, తుఫాను ప్రభావంతో నెల్లూరు జిల్లాలో అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, జేసీ కార్తీక్ తీర ప్రాంతాలు, పెన్నా తీరంపై ప్రత్యేక దృష్టి సారించారు. మత్స్య కారులు సముద్రంలో చేపల వేటకి వెళ్ళరాదని హెచ్చరికలు జారీ చేశారు. వేటకి వెళ్లిన మత్స్యకారులు తిరిగి రావాలని ఆదేశించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం, తుపాన్ ప్రజావంతో రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఆదివారం ఆయన వెబెక్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు. తుఫాన్ వచ్చినట్లయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోడా నికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పెన్నా నది గట్లను పరిశీలించాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్నా, గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్నాకి వరద వస్తే నదీ పరివాహక ప్రాంతంలో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. యజమానులతో మాట్లాడి బోట్లు, ఎక్స్కవేటర్లను సిద్ధంగా ఉంచుకో వాలని ఆదేశించారు. వాటి తరలింపునకు వాహనాలను, మనుషులను సిద్ధంగా చేసుకోవాలన్నారు. ప్రాణనష్టంకాని, పశునష్టం కాని జరకుండా చూడాలన్నారు. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, పాలు, కూరగాయల వాహనాలు, పెట్రోలు, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో ముందుగా నీటిని నింపుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తీరప్రాంత గ్రామాల్లో టామ్ బామ్ ద్వారా, మైన్ల ద్వారా ప్రజలను



అప్రమత్తం చేయాలని చెప్పారు. బారీ వర్షాలు సంభవిస్తే సురక్షిత ప్రాంతాలకు ప్రజలు చేరుకోవాల న్నారు. తీర ప్రాంతాల్లో పూరి గుడిసెలు, తాటాకు ఇళ్లలో ఉండే ప్రజలు పక్కా భవనాల్లోకి, తుపాన్ షెల్టర్లలోకి వెళ్లాలన్నారు. వైద్యశాలల్లో అత్యవసర మందులు, పాముకాటుకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్ అండ్ బీ, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించా మన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు. వేటకు వెళ్ళినవారు తిరిగి వచ్చేయాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని హెచ్ క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్ కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ మూడు షిఫ్టుల్లో సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. తుఫాన్ కారణంగా సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ వెబెర్స్ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో ఆదివారం మూడు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మర్రిపాడులో 32 మి.మీ, అత్యల్పంగా గుడ్లూరులో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది. నెల్లూరు జిల్లాకు తుపాన్ ముప్పు ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరినీ అప్రమత్తం చేసి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. ఆదివారం ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందని, వాతావరణ శాఖ నుంచి హెచ్చ రికలు ఉన్నందున అన్ని ప్రాంతాల్లో అధికా రులంతా పూర్తి అప్రమత్తంగా ఉండాల న్నారు. షిఫ్ట్ ఆపరేటర్లు, కాంట్రాక్ట్, ప్రైవేటు సిబ్బందిని అందుబాటులో ఉంచు కోవా లన్నారు. ఏ ప్రాంతంలో ఇబ్బంది జరిగిన వెంటనే స్పందించేలా అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు.

## పట్టుకుని వెళ్ళి కాల్చి చంపారు

### ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌పై మావోల లేఖ విడుదల



**ఖమ్మం, అక్టోబర్ 14 (ప్రభాత సూర్యుడు):** ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ లేఖ విడుదల చేసింది. దంతెవాడ నారాయణపూర్ ఎన్ కౌంటర్‌లో 31 మంది మావోయిస్ట్‌లు అమరులయ్యారని.. గోవాడి, బొండోస్, తుల్తులి అటవీ ప్రాంతంలో ఎన్ కౌంటర్ జరిగిందని, కార్పొరేట్ మైనింగ్ కంపెనీల కోసం పోలీసులు ఆపరేషన్ కగార్ నిర్వహించారని పేర్కొంది. అక్టోబర్ 4వ లేదీ ఉదయం 11.30 నుంచి రాత్రి 9 గంటల వరకు 11 సార్లు భద్రతా బలగాలు కాల్పులు జరిపారని.. ఎదురు కాల్పులు ల్లో 14 మంది మావోయిస్ట్‌లు అమరులు అయ్యారని, మరుసటి రోజు ఉదయం అక్టోబర్ 5న కాల్పుల్లో గాయపడ్డ 17 మందిని పట్టుకుని హత్య చేశారని పేర్కొంది. తూర్పు బస్తర్ డివిజన్ కమిటీని అంతం చేయడానికి ఫాసిస్ట్ పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తుందని మండిపడింది. అమరవీరుల ఆశయాలను స్మరించుకుంటూ విప్లవోద్యమం ముందుకు తీసుకు వెళతామని స్పష్టం చేసింది. తూర్పు బస్తర్ డీవిజన్ కమిటీ పేరుతో మావోయిస్ట్ పార్టీ లేఖ విడుదల చేసింది. కాగా అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం అంటే అక్టోబర్ 4 జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు శనివారం దంతెవాడ జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ బస్తార్ ఐజీ పి. సుందర్‌రాజన్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టుల్లో 13 మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు. మృతులంతా ఇంద్రావతి ఏరియా కమిటీ పీఎల్‌జీఏ 6 బెటాలియన్ సభ్యులని తెలిపారు. మృతుల్లో ఇప్పటివరకు 15 మందిని పోలీసులు గుర్తించారు. వీరిపై రూ.1.30 కోట్లు రివార్డు ఉందని ఐజీ తెలిపారు. ఇంకా 16మంది మావోయిస్టులను గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో మావోయిస్టులకు చెందిన 30 తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అబూజ్‌మడ్ అడవుల్లో సుమారు 50 నుంచి 70 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు సమాచారం రావడంతో ఎస్టీఎఫ్, బీఎస్ఎఫ్, బీఆర్‌జీ బలగాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నేందూరు, తూలితూలి అడవుల్లోకి జవాన్లు చేరుకోగానే మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారని, ప్రతిగా బలగాలు ఎదురు కాల్పులు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కాల్పులు జరిగాయన్నారు. క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో ఒక ఐఎంజీ మిషన్‌గన్, 4 ఏకే 47గన్స్, ఇతర తుపాకులు, బులెట్లు, బీజీయల్స్, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ తెలిపారు. దండకారణ్య కమిటీ సభ్యురాలు నీతి అలియాస్ ఉర్మిళపై రూ.21లక్షల రివార్డు ఉందని ఐజీ తెలిపారు. ఇప్పటికి గుర్తించిన వారిలో తెలంగాణ రాష్ట్రాని చెందిన వారు ఎవరూ లేరని, మిగతా వారి గుర్తించి వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగిస్తామని వెల్లడించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215